

వేంకటేశ్వరస్వామి వ్రతాలు

వినుకొండ(నూజెండ్ల): మాఘమాసం సందర్భంగా శ్రీనివాస నగర్‌లోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఉచిత సామూహిక వ్రతాలు నిర్వహించారు.



శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ జ్యోతి ఊరేగింపు

నకరికల్లు: స్థానిక గోపయ్య సమేత శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ జ్యోతి ఉరేగింపు మహోత్సవం శుక్రవారం కన్నుల పండువగా నిర్వహించారు. మహిళలు వార్లు పోసి మొక్కులు చెల్లించారు.

నెల్లెమ్మ తల్లి విగ్రహం ప్రతిష్ట



చెరుకుపల్లి: మండలం పరిధిలోని ఆరుంబాక గ్రామంలో నిర్మించిన ఆలయంలో శుక్రవారం వేద పండితుల మంత్రోచ్ఛారణల నడుమ నెల్లెమ్మ తల్లి, ముత్యాలమ్మ, పోతురాజు స్వామి వార్ల విగ్రహాలను ఘనంగా ప్రతిష్టించారు.

న్యూస్‌రీల్

మాజీ మంత్రి విడదల రజినిపై
అక్రమ కేసు

ఐ–టీడీపీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదుపై ఐదున్నరేళ్ల తర్వాత అట్రాసిటీ కేసు



చిలకలూరిపేట: కట్టు కథ అల్లి ఓ టీడీపీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా మాజీ మంత్రి విడదల రజినిపై పల్నాడు జిల్లా చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. మహిళలు సైతం అధికార పార్టీ వేధింపులకు మినహాయింపు కాదని ఈ సంఘటన రుజువు చేసింది. పల్నాడు జిల్లా చిలకలూరిపేట వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఎన్నిక అయిన నాటి నుంచే ఆమెను లక్ష్యంగా చేసుకుని అధికార పక్ష నాయకులు గతంలో శాంతియుతంగా జరిగిన ఒక కార్యక్రమంలో సైతం మాజీ మంత్రి, ఆమె అనుచరులపై కేసు నమోదు చేయగా ప్రస్తుతం ఏకంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయించారు. వివరాల్లోకి వెళితే...ఐ–టీడీపీకి చెందిన పిల్లి కోటేశ్వరరావు 2019లో విడదల రజినికి వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టాడు. దీనికి సంబంధించి అప్పటి సీఐ వి. సూర్యనారాయణ తనను నిర్బంధించి వేధించాడని ఐదున్నర ఏళ్ల తర్వాత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే తడవుగా అర్బన్ పోలీసులు గురువారం రాత్రి మాజీ మంత్రి విడదల రజిని అప్పటి సీఐ వి. సూర్యనారాయణ, మాజీ మంత్రి పీఏలు నాగిశెట్టి జయఫణీంద్ర, రామకృష్ణపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. గతంలోనూ విద్యుత్ చార్జీలకు నిరసనగా శాంతియుతంగా నిరసన కార్యక్రమం నిర్వహించి విద్యుత్ అధికారులకు వినతి పత్రం అందించిన సందర్భంలోనూ మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై కేసు నమోదు చేశారు.

గుండాటలో ఘర్షణ.. పోలీసుల లాఠీచార్జి

ఒకరికి తీవ్ర గాయాలు


మాచవరం: గురజాల నియోజకవర్గం మాచవరం మండలం మోర్జంపాడు గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణోత్సవం సందర్భంగా బొబ్బాయి (గుండాట) నిర్వహణ పోలీసుల లాఠీచార్జికి దారి తీసింది. తెలిసిన వివరాల ప్రకారం.. తిరునాళ్ల సందర్భంగా గ్రామంలోని ప్రధాన రహదారిలో గుండాట నిర్వహిస్తున్నారు. తోపులాటలో ఓ వ్యక్తి గుండాట బల్లపై పడడంతో నిర్వాహకులకు అక్కడ ఉన్న వ్యక్తుల మధ్య వివాదం నెలకొంది. ఇద్దరి మధ్య ఘర్షణ జరగడంతో అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ కె.సతీష్, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని లాఠీచార్జి చేసి, చెదరగొట్టారు. ఈ క్రమంలో గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కింద పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. చికిత్స నిమిత్తం పిడుగురాళ్లలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

యార్డులో 93,597 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు (గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 84,278 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 93,597 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,000 నుంచి రూ.14,700 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.9,500 నుంచి రూ.11,000 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.10,000 నుంచి రూ.12,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,000 నుంచి రూ.7,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 65,583 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 547.10 అడుగుల వద్ద ఉంది. కుడి కాలువకు 10,040 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ఖిల్ నాయక్

తండ్రి ధర్మకర్త... అడ్డదారిలో కుమారుడు

- అధికార పార్టీ అండదండలు
- మస్తాన్ సాయిపై ప్రభుత్వ ఆరోపణలపై ఉదాసీనత
- ముతవల్లీ పోస్టు నుంచి తొలగించాలని సిఫార్సు చేసిన వక్ఫ్ ఇన్‌స్పెక్టర్
- బుట్టదాఖలు చేసిన ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, గుంటూరు: రెండు తెలుగు రాష్ట్రాలలో డ్రగ్స్, సెక్స్ రాకెట్‌లో మార్మోగుతున్న పేరు మస్తాన్ సాయి. అతను గుంటూరులోని మస్తానయ్య దర్గా నిర్వాహకుడైన రావి రామమోహనరావు కుమారుడు. గతంలో కూడా ఇతనిపై డ్రగ్స్ కేసులు ఉన్నాయి. సినీ హీరో రాజ్ తరుణ్–లావణ్య కేసులో మస్తాన్ సాయి పేరు వెలుగు చూసింది. దర్గాకు దర్శనం కోసం వచ్చినప్పుడు తనతో మస్తాన్ సాయి అసభ్యంగా ప్రవర్తించినట్లు లావణ్య గుంటూరు పట్టాభిపురంలో ఫిర్యాదు చేసింది. అయినా ఇక్కడి పోలీసుల పట్టించుకోలేదు. ఇద్దరికీ రాజీ చేసే ప్రయత్నం చేశారు. ఆగస్టులో విజయవాడ పోలీసులు డ్రగ్స్ సరఫరా కేసులో అదుపులోకి తీసుకున్నారు. తాజాగా అతని హార్డ్ డిస్క్‌లో పెద్దఎత్తున యువతులతో అశ్లీల వీడియోలు, వందల సంఖ్యలో ఫొటోలు ఉన్నట్లుగా గుర్తించారు. ఈ హార్డ్ డిస్కును లావణ్య తెలంగాణలోని నార్సింగి పోలీసుస్టేషన్‌లో అప్పగించి ఫిర్యాదు చేయడంతో మళ్లీ పోలీసులు మస్తాన్ సాయిని అరెస్టు చేసి విచారణ జరుపుతున్నారు. గతంలో అరెస్టు చేసినప్పుడు కేవలం డ్రగ్స్ వ్యవహారంపై విచారణ జరిపి వదిలిపెట్టేశారు. దీనికి అతని తండ్రి మస్తానయ్య దర్గా నిర్వాహకుడు కావడం, అధికార పార్టీతో మంచి సంబంధాలు ఉండటమే కారణమని సమాచారం. అతనికి సంబంధించిన అన్ని వ్యవహారాలను గతంలో గుంటూరులో ఫిర్యాదు చేసినప్పుడు లావణ్య ప్రస్తావించినా, అప్పుడు తనకున్న పలుకుబడిని ఉపయోగించి అతని తండ్రి కేసును ముందుకు వెళ్లకుండా చేశారు.

విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ విక్రయాలు



ఢిల్లీ, బొంబాయి, హైదరాబాద్ వంటి ప్రాంతాలకే పరిమితమైన డ్రగ్స్ కల్చర్ గుంటూరులో పరిచయం చేసింది కూడా మస్తాన్‌సాయి, అతని స్నేహితులే. సంపన్న వర్గాలు, కొంత మంది యువతులు, పలు యూనివర్సిటీలకు చెందిన విద్యార్థులే లక్ష్యంగా డ్రగ్స్ విక్రయాలు జరుగుతున్నాయి. దీనిలో ప్రధాన పాత్రధారులుగా ఉన్న షరీఫ్, ఖాజామొహియద్దీన్, మస్తాన్‌సాయిలు గుంటూరు వాసులే. గతంలో కూడా అనేక ఆరోపణలు వచ్చినా తనకున్న పలుకుబడితో పోలీసులు కూడా తమవైపు చూడకుండా చేసుకున్నారు. డ్రగ్స్ విషయంలో ఆరోపణలు రావడంతో వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్ షేక్ ముక్తార్ బాషా సెప్టెంబర్ 30న ఏపీ స్టేట్ వక్ఫ్ బోర్డు సీఈవోకు లేఖ రాశారు. 1983లో హజరత్ కాలే మస్తాన్ వలీ దర్గాను వక్ఫ్ ఆస్తిగా గుర్తించి దానికి రావి మాజీ మస్తాన్‌రావును ముతవల్లీగా నియమించారు. మస్తాన్‌రావు చనిపోయిన తర్వాత అతని దత్తత కుమారుడైన రావి రామమోహనరావును కోర్టు ఆదేశాలతో తాత్కాలిక ముతవల్లీగా నియమించారు. 2021లోనే అతనికి దర్గా మీద ఎటువంటి హక్కులు లేవని, ఈ ఆస్తులన్నీ వక్ఫ్‌కే చెందుతాయని నోటీసు కూడా ఇచ్చారు. అప్పటి నుంచి ఆ వివాదం కొనసాగుతూనే ఉంది. ఈలోగా రావి మస్తాన్ సాయి నార్కొటిక్ డ్రగ్స్ సప్లయి చేస్తున్నట్లు గుర్తించి అరెస్టు చేసింది. మస్తాన్ సాయి తాత్కాలిక ముతవల్లీగా ఉన్న రామ్మోహన్ కుమారుడు కావడం, అతను అరెస్టు సమయంలో దర్గాలోనే తలదాచుకుని ఉండటంపై వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వక్ఫ్ బోర్డు సీఈవోకి నివేదిక పంపారు. దర్గాను అడ్డం పెట్టుకుని అనైతిక కార్యక్రమాలకు పాల్పడుతూ పవిత్రతను దెబ్బతీసుకున్న నేపథ్యంలో ముతవల్లీని తొలగించి దర్గాను వక్ఫ్‌బోర్డు స్వాధీనం చేసుకోవాలని ఆయన కోరారు. అయితే, కూటమి ప్రభుత్వంలో తనకు ఉన్న సంబంధాలను అడ్డం పెట్టుకుని రామ్మోహన్ దీనిపై ఎటువంటి ఆదేశాలు రాకుండా ఉన్నతాధికారులను మేనేజ్ చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీనికి జిల్లాకు చెందిన అధికార పార్టీ నేతలు కొందరు అండగా ఉన్నట్లు భావిస్తున్నారు.

అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలు



స్వామికి అవభృద స్నానం



వేంకటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంలో శుక్రవారం అంగరంగ వైభవంగా బ్రహ్మోత్సవాలను నిర్వహించారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో ఉదయం స్వామికి అవభృదస్నానం, కృష్ణానదిలో చక్ర తీర్థం, అనంతరం ప్రోక్షణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుంచి శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, మహా పూర్ణాహుతి, వేదాశీర్వచనాలతో జరిపారు. కార్యక్రమాలలో విజయకీలాద్రి దివ్యక్షేత్ర వేద పండితులు, అర్చకులు, జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ నిర్వాహకులు పురాణం వెంకటాచార్యులు, వేద విద్యార్థులు, భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సన్నద్ధం

తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ



తెనాలి: కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు తెనాలి డివిజన్ ఎన్నికల అధికారి, తెనాలి సబ్ కలెక్టర్ వి.సంజనా సింహ వెల్లడించారు. స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఆమె మీడియాతో మాట్లాడారు. ప్రస్తుతం కృష్ణా–గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ పదవీకాలం మార్చి 29వ తేదీతో పూర్తికానున్నదని తెలిపారు. ఎలెక్షన్ కమిషన్ ఎన్నికల నిర్వహణకు ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ విడుదల చేసినట్టు గుర్తు చేశారు. నామినేషన్ల దాఖలుకు తుది గడువు ఈనెల పదో తేదీ కాగా, ఆ మరుసటి రోజు స్క్రూటినీ జరుగుతుందని, 13న తుది అభ్యర్థులను ప్రకటిస్తారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికకు ఈనెల 27న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని వివరించారు. రాజకీయ పార్టీలకు ఇప్పటికే జిల్లా, నియోజకవర్గ, మండల స్థాయిల్లో సమావేశాలు నిర్వహించి, విధివిధానాలపై అవగాహన కల్పించామని తెలిపారు. పోలింగ్ కోసం తెనాలి డివిజనులో 51 కేంద్రాలు, నియోజకవర్గంలో 27 పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. వెయ్యికన్నా అధికంగా ఓట్లు ఉంటే అదనపు పోలింగ్ కేంద్రాలను ప్రతిపాదించాలన్న ఎన్నికల కమిషన్ సూచనపై డివిజనులో ఎనిమిది యాగ్జిలరీ పోలింగ్ కేంద్రాలను ఎంపికచేసి పంపామని వెల్లడించారు. వీటిలో తెనాలిలో రెండు, మంగళగిరిలో రెండు, తాడేపల్లిలో మూడు, పొన్నూరులో ఒకటి ఉన్నాయని, అనుమతి వస్తే వీటితో కలిపి మొత్తం 59 పోలింగ్ కేంద్రాలు ఉంటాయని సబ్ కలెక్టర్ తెలిపారు. తెనాలి డివిజన్‌లో గ్రాడ్యుయేట్ ఓటర్లు 45,707 మంది కాగా, నియోజకవర్గంలో 23,707 మంది ఉన్నట్టు చెప్పారు. ఎన్నికల్లో పాల్గొనే పోలింగ్ అధికారులు, సహాయ పోలింగ్ అధికారులకు జిల్లా కలెక్టరేట్‌లో శిక్షణ సదస్సులు ఉంటాయని పేర్కొన్నారు. నోటిఫికేషన్ విడుదలైన ఫిబ్రవరి 3 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని గుర్తు చేశారు. నిబంధనల ప్రకారం రాజకీయ పార్టీల ఫ్లెక్సీల తొలగింపు, విగ్రహాలకు ముసుగులు వేయడం పూర్తయిందని చెప్పారు. అవాంతరాలు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా పూర్తయ్యేందుకు జిల్లా ఎన్నికల అధికారి నాగలక్ష్మి పర్యవేక్షణలో అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు వివరించారు.

ఎన్నికల కోడ్‌కు మంగళం

- నిబంధనలకు విరుద్ధంగా 'ఆలపాటి' నామినేషన్
- కలెక్టరేట్‌కు భారీ సంఖ్యలో వచ్చిన టీడీపీ నాయకులు, ఎమ్మెల్యేలు, మంత్రులు



జిల్లా కలెక్టరేట్ వద్ద గుమిగూడిన టీడీపీ నేతలు

లక్ష్మీపురం: ఉమ్మడి కృష్ణ, గుంటూరు జిల్లాల పట్టభద్రుల శాసన మండలి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఆలపాటి రాజా శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లో నిబంధనలకు విరుద్ధంగా నామినేషన్ దాఖలు చేశారు. జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో ఏకంగా కూటమి పార్టీ జెండాలతో గుంటూరు, కృష్ణా జిల్లాల ఎమ్మెల్యేలు, మంత్రులు పార్టీ శ్రేణులతో కలిసి నామినేషన్ వేసేందుకు వచ్చారు. ఎన్నికల కోడ్ ప్రకారం అభ్యర్థితో పాటు ప్రతిపాదించే వారు తప్పా మిగిలిన వారు కలెక్టరేట్ గేటు బయట ఆవరణలోనే ఉండాలి. అయితే, అధికార పార్టీ అండతో ఇష్టారాజ్యంగా జిల్లా కలెక్టరేట్‌లోకి పార్టీ శ్రేణులు లోపలికి వచ్చాయి. మరో వైపు పోలీసులు కూడా చూస్తూ నిలబడ్డారు. జిల్లా కలెక్టరేట్‌కు పనులపై వచ్చే ప్రజలకు అవస్థలు తప్పలేదు. ఎట్టకేలకు రాజా నగరంలోని పలువురు పార్టీ శ్రేణులు, అభిమానుల నడుమ స్థానిక వెంకటేశ్వర విజ్ఞాన మందిరం వద్ద నుంచి భారీ ర్యాలీతో కలెక్టరేట్‌కు చేరుకుని నామినేషన్ దాఖలు చేశారు. ఆయన వెంట గుంటూరు ఈస్ట్, వెస్ట్ ఎమ్మెల్యేలు, మంత్రులు, పార్టీ నాయకులు ఉన్నారు. ఆయన ప్రత్యర్థిగా కె.యస్. లక్ష్మణరావు ఈనెల 10న దాఖలు చేయనున్నట్లు తెలుస్తోంది.

ఎనిమిది మంది నామినేషన్లు దాఖలు

ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్లు శుక్రవారం ఎనిమిది మంది వేశారు. తెలుగుదేశం పార్టీ నుంచి ఆలపాటి రాజేంద్రప్రసాద్, తెలుగు రాజాధికార సమితి పార్టీ నుంచి అనిల్‌కుమార్ జాలాది, ఇండిపెండెంట్లుగా బాలకృష్ణ మంత్రి, గంటా మమత, జూపూడి శ్యామ్ ప్రసాద్, కందుల వెంకటరావు, లగడపాటి వేణుగోపాల్, మూరకొండ చంద్రశేఖర్ నామినేషన్లను జిల్లా కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్.నాగలక్ష్మికి అందజేశారు.

సుల్తానాబాద్‌ను జల్లెడ పట్టిన పోలీసులు

- 160 మందికి పైగా విస్తృత తనిఖీలు
- 59 వాహనాల సీజ్
- ఆరుగురిని అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నేరాల నియంత్రణకేనన్న అదనపు ఎస్పీ రమణమూర్తి



కార్డన్ సెర్చ్‌లో విచారిస్తున్న అదనపు ఎస్పీ రమణమూర్తి

తెనాలి: పట్టణంలో పోలీసులు శుక్రవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. తెనాలి–గుంటూరు–నారాకోడూరు రోడ్డులోని సుల్తానాబాద్‌లో విస్తృతంగా తనిఖీ చేశారు. త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈ ఏరియాలో వేకువజామున ఐదు గంటలకు పోలీసులు మోహరించారు. అదనపు ఎస్పీ జీవీ రమణమూర్తి, తెనాలి డీఎస్పీ బి.జనార్దనరావు నేతృత్వంలో రెండున్నర గంటలసేపు విస్తృతంగా తనిఖీలు చేశారు. ముందుగా సుల్తానాబాద్ దగ్గరి వ్యవసాయ మార్కెట్ యార్డులో తెనాలి సబ్‌డివిజన్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ల అధికారులు, సిబ్బందితో అదనపు ఎస్పీ సమావేశమయ్యారు. పలు సూచనలనిచ్చారు. అక్కడ నుంచి 150 మంది పోలీసులు, 10 మంది స్పెషల్ పార్టీ సిబ్బంది బయలుదేరి సుల్తానాబాద్ సెంటర్‌కు చేరుకున్నారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్‌బాబు, టూ టౌన్ సీఐ రాములునాయక్, వన్‌టౌన్ సీఐ మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు, సిబ్బంది కలిసి బృందాలుగా విడిపోయారు. సుల్తానాబాద్ ఏరియాను జల్లెడపట్టారు. వడ్డెర కాలనీ, సుగాలీ కాలనీ, శివాలయం వీధి ప్రాంతాల్లో ప్రతి ఇంటికీ వెళ్లారు. అక్కడ ఎవరైనా అనుమానితులు ఉన్నారా? ఎంతకాలంగా నివాసం ఉంటున్నారని ఆరా తీశారు. ఇళ్ల వద్ద ఉన్న ఆటోలు, బైక్‌లు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 56 ద్విచక్ర వాహనాలు, మూడు ఆటోలను సీజ్ చేశారు. త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లుగా, అనుమానితులుగా ఉన్న ఆరుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. సుల్తానాబాద్ ప్రాథమిక పాఠశాల ఎదురు వీధిలో ఓ ఇంట్లో ఉన్న ఇతర రాష్ట్రానికి చెందిన నలుగురు యువకులను పోలీసులు గుర్తించారు. వారి వద్ద అనుమానాస్పదంగా ఓ కవర్‌లో ఉన్న పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు.

నేరాల నియంత్రణ కోసమే..

కార్డన్ సెర్చ్ అనంతరం అదనపు ఎస్పీ రమణమూర్తి మాట్లాడుతూ తెనాలి సబ్ డివిజన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని చెప్పారు. అందులో భాగంగానే స్థానిక ప్రత్యేక పోలీస్ బలగాలతో 340 దాకా ఉన్న ఇళ్లను క్షుణ్ణంగా పరిశీలించినట్లు తెలిపారు. పత్రాలు, నంబర్ ప్లేట్లు లేని 59 వాహనాలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. పత్రాలు చూపిస్తే వాటిని రిలీజ్ చేస్తామని చెప్పారు. ఇదే కార్డన్‌సెర్చ్ రానున్న రోజుల్లో సబ్ డివిజన్ వ్యాప్తంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు కూడా నేరాల నియంత్రణకు పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు.

ఆద్యంతం ఆనందం.. ఉత్సాహం

సందడిగా విజ్ఞాన్ మహోత్సవ్



పరుగు పందెంలో విద్యార్థినులు

చేబ్రోలు: చదువుతో పాటు క్రీడలు, సృజనాత్మకత అంశాలపై ప్రావీణ్యం సాధించినప్పుడే సంపూర్ణ విద్యార్థులు అవుతారని విజ్ఞాన్ యూనివర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ తెలిపారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో జాతీయ స్థాయి విజ్ఞాన్ మహోత్సవ్ రెండో రోజు శుక్రవారం సందడి సందడిగా సాగింది. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఆటల్లో ఉత్సాహంగా పాల్గొనడం వల్ల జిజ్ఞాస, సమర్థ సమయ పాలన, బుద్ధి స్థిరత్వం, వేగంగా సంగ్రహించుకోగలగడం వంటి ఎన్నో అంశాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. క్రీడలు శారీరక ఉల్లాసానికే కాకుండా మానసిక ఉల్లాసానికి కూడా దోహదపడుతాయని చెప్పారు. దేశానికి అమూల్యమైన సంపద యువతేనని పేర్కొన్నారు.

ఆసక్తికరంగా పోటీలు

జాతీయ స్థాయి విజ్ఞాన మహోత్సవ్‌లో భాగంగా నిర్వహిస్తున్న పోటీలు ఆసక్తికరంగా సాగాయి. వివిధ అంశాల్లో క్రీడాకారులు నువ్వా.. నేనా ! అన్నట్లు పోటీ పడ్డారు. అథ్లెటిక్స్‌లో భాగంగా 100, 200, 400, 800 మీటర్ల పరుగు పందేలను నిర్వహించారు. వీటితో పాటు వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ, ఖోఖో, ఫుట్‌బాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలను నిర్వహించారు. పోటీలన్నీ కూడా సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నాయి. చివరి రోజు శుక్రవారం ఫైనల్స్ మ్యాచ్‌లు జరగనున్నాయి.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన విద్యార్థులు సోలో సాంగ్స్, లఘు నాటికలు, రెట్రో డాన్స్ ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. కళాకారులు పలు నృత్య రూపకాలను ప్రదర్శించారు. జానపద, శాస్త్రీయ నృత్య ప్రదర్శనలతోపాటు మ్యూజిక్, లిటరరీ, స్పాట్‌లైట్, డాన్స్, డ్రమాటిక్స్ అండ్ ఫిల్మ్ మేకింగ్, ఫ్యాషన్, ఫైన్ ఆర్ట్స్, కల్చరల్స్, థియేటర్ ఆర్ట్స్ పోటీల్లో విద్యార్థులు సత్తా చాటారు. విద్యార్థులు ఏర్పాటు చేసిన స్టాళ్లు ఆకర్షించాయి. కార్యక్రమంలో విజ్ఞాన్ విద్యా సంస్థల చైర్మన్ లావు రత్తయ్య, సీఈవో డాక్టర్ మేఘన కూరపాటి, వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎం.ఎస్. రఘునాథన్, డీన్లు పాల్గొన్నారు.

నేడు సందడి చేయనున్న క్రీడా, సినీ తారలు

విజ్ఞాన్ మహోత్సవ్‌లో భాగంగా శుక్రవారం జరిగే ముగింపు కార్యక్రమానికి ఇండియన్ ఫిల్మ్ డైరక్టర్, స్క్రీన్ రైటర్ కె.ఎస్.రవీంద్ర (బాబీ), 2024 పారా ఒలింపిక్స్ బ్రాంజ్ మెడలిస్ట్, ఇండియన్ పారా పిస్టల్ షూటర్, అర్జున అవార్డీ రుబినా ఫ్రాన్సిస్ హాజరవుతున్నట్లు వైస్ చాన్స్‌లర్ తెలిపారు.



చెస్ పోటీలో లీనమైన విద్యార్థినులు



కబడ్డీ పోటీలో ప్రత్యర్థిపై పట్టు

10 నుంచి ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నీ

మంగళగిరి ఏసీఏ స్టేడియంలో నిర్వహణ

లక్ష్మీపురం: ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళగిరిలోని ఏసీఏ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు ఐఏ అండ్ ఏడీ సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ –2025 పోటీలు జరగనున్నాయి. విజయవాడలోని ప్రిన్సిపల్ అకౌంటెంట్ జనరల్ (ఆడిట్) కార్యాలయం నేతృత్వంలో తొలిసారి సౌత్ జోన్ క్రికెట్ టోర్నమెంట్ అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. దక్షిణాది నుంచి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహిస్తున్న జట్లు తలపడనున్నాయి. తొలిసారిగా క్రీడలను ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం గర్వించదగ్గ విషయం. ఆల్ ఇండియా క్రికెట్ టోర్నమెంట్‌కు అర్హత పొందేందుకు ఇది ఉపయోగపడనుందని ఆడిట్ కార్యాలయ వర్గాలు వెల్లడించాయి. టోర్నమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబర్చిన క్రీడాకారులు జాతీయ స్థాయిలో వారి రాష్ట్రాలకు ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని పొందుతారు. టోర్నమెంట్ 10వ తేదీ ఉదయం 8 గంటలకు ప్రారంభమై 13 మధ్యాహ్నం 1.30 గంటలకు ముగింపు వేడుకతో ముగుస్తుంది. ప్రతి ఒక్కరూ మ్యాచ్‌లు వీక్షించే అవకాశం కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో శుక్రవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. **4,000** గరిష్టం : రూ. **4,900**

మోడల్ ధర రూ. **4,500**

క్లుప్తంగా

క్రీడలకు ఎంపికైన ఉద్యోగులకు నగదు ప్రోత్సాహం



లక్ష్మీపురం: హైదరాబాద్‌లో ఈ నెల 11 నుంచి మూడు రోజులపాటు జరగనున్న సెంట్రల్ రెవెన్యూ ఆఫీసర్స్ సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్‌కు గుంటూరు సెంట్రల్ జీఎస్టీ డిపార్ట్‌మెంట్ నుంచి ఐదుగురు ఉద్యోగులు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం కన్నవారితోటలోని జీఎస్టీ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కస్టమ్స్, సెంట్రల్ ట్యాక్స్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి అభినందించడంతో పాటు ఒక్కొక్కరికీ ఐదు వేలు చొప్పున అందజేశారు. ఉద్యోగులు క్రీడలలో మరింత రాణించి, పతకాలు సాధించాలని కమిషనర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ మీట్‌కు ఎంపికైన ఉద్యోగులు కాకర్ల శ్రీనివాస్, శాఖమూరి శ్రీనివాస్, పి.వెంకటాచలం, పి.వెంకటేశ్వర్లు, బిల్లా ప్రశాంత్ కుమార్ అసిస్టెంట్ కమిషనర్ (స్పోర్ట్స్ ఆఫీసర్) ఎం.నాగరాజు, సూపరింటెండెంట్లు గాదె శ్రీనివాసరెడ్డి, సీహెచ్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

50 గేదెలకు రేడియం ట్యాగ్‌లు



రాయపూడి(తాడికొండ): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ సూచనల మేరకు తుళ్లూరు మండలం రాయపూడిలో 50 గేదెలకు రేడియం ట్యాగ్‌లు వేసినట్లు కార్యదర్శి మల్లికార్జునరావు తెలిపారు. రోడ్లపై గేదెలు రాత్రివేళ తిరుగుతున్న సమయంలో వాహనాలకు సరిగా కనిపించక ఢీకొట్టి మృత్యువాత పడుతున్నాయి. ఈ నేపథ్యంలో న్యాయ సేవాధికార సంస్థ తీసుకున్న నిర్ణయంపై పాడి రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

లోకేష్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

పారా మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ బాబు



గుంటూరు మెడికల్: యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని పారా మెడికల్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వి. రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఆప్కాస్‌ను రద్దు చేస్తే ప్రభుత్వంతో యుద్ధం చేస్తామని, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు అన్యాయం జరిగితే సహించేది లేదని పేర్కొన్నారు. ఎన్నికల సమయంలో హామీలు గుప్పించి, అధికారం చేపట్టాక మరిచిపోతున్నారని విమర్శించారు. అధికారం కోసమే ఉచిత హామీలు ఇస్తున్నారని మండిపడ్డారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించకపోతే 'చలో ఉండవల్లి'కి పిలుపుని స్తామని స్పష్టం చేశారు. గతంలో ఆప్కాస్ విధానం లేనప్పుడు ఏజెన్సీలను నడిపిన దళారులు సమయానికి జీతభత్యాలు, పీఎఫ్ జమ చేయలేదని తెలిపారు. ఆప్కాస్ వచ్చాకే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు 1న జీతాలు చెల్లిస్తున్నారని పేర్కొన్నారు. తిరిగి ఏజెన్సీలకు అప్పగిస్తే ఉద్యోగులు సర్వీసును కోల్పోతారని, జీతభత్యాలు, పీఎఫ్‌లు చెల్లించడంలో జాప్యం జరుగుతుందని వెల్లడించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. పది సంవత్సరాలు పైబడి అవుట్‌సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న ఉద్యోగులను కాంట్రాక్టు పద్ధతిలోకి మార్చాలని, జీఓఎంఎస్ నంబరు 2ను సవరించి మినిమం ఆఫ్ టైమ్ స్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రతి ప్రభుత్వ శాఖలో ప్రిన్సిపల్ సెక్రటరీ స్థాయి అధికారులే అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులపై వివక్షత చూపిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలోనే పారామెడికల్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల భవిష్యత్తు కార్యాచరణ ఉంటుందని తెలిపారు.

ప్రమాదంలో గాయపడిన కానిస్టేబుల్ మృతి



ఇమ్రాన్‌వలి (ఫైల్)

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కానిస్టేబుల్ మృతి చెందిన ఘటనపై కేసు నమోదైంది. గుంటూరు వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య తెలిపిన వివరాల ప్రకారం... నల్లచెరువులో నివాసం ఉండే షేక్ ఇమ్రాన్‌వలి (36) గుంటూరు ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్ వాహన డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 5వ తేదీ రాత్రి డీఎస్పీని ఇంటి వద్ద దింపి తిరిగి వస్తున్నాడు. కోబాల్డుపేట 4వ లైను మసీదు వద్ద పూటుగా మద్యం తాగి బైక్‌పై వస్తున్న ముగ్గురు ఢీకొట్టారు. తీవ్రంగా గాయపడిన ఇమ్రాన్‌వలిని చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకు వెళ్లారు. తలకు తీవ్ర గాయం కావడంతో ఆరో తేదీ రాత్రి ఒంటి గంట సమయంలో మృతి చెందాడు. అయితే, కేసులో ద్విచక్ర వాహనం నడిపిన వారిలో ఒకడు మాత్రమే దొరికాడు. మరో వ్యక్తి ప్రకాశం జిల్లాలోని ఒక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు వెస్ట్ ట్రాఫిక్ పోలీసులకు సమాచారం వచ్చింది. మరో వ్యక్తికి సంబంధించిన వివరాలు తెలియలేదు. ఇమ్రాన్‌వలి భౌతికకాయానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించారు. అతడికి భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న రూరల్ సీఐ శ్రీనివాసరావు

మంగళగిరి: నగర పరిధిలోని యర్రబాలెంలో మైనర్ బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో సీఐ శ్రీనివాసరావు వివరాలు వెల్లడించారు. ఎనిమిదో తరగతి చదువుతున్న మైనర్ బాలికతో గత పది రోజులుగా యర్రబాలెం ఇండస్ట్రియల్ ఏరియాలో నివసిస్తున్న బాషా అసభ్యకరంగా ప్రవర్తిసున్నాడు. తనను ప్రేమించాలని, లేచి పోదామని వెంబడిస్తూ బెదిరిస్తున్నాడు. తనతో రాకపోతే మార్ఫింగ్ చేసి న్యూడ్ ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తాననడంతో ఆందోళన చెందిన బాలిక తండ్రికి తెలియజేయడంతో తట్టుకోలేక గుండెపోటుకు గురయ్యాడు. బాలిక ఆత్మహత్యకు ప్రయత్నించింది. దీంతో తల్లి రూరల్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం బాషాను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐలు ఎస్. వెంకట్, లోకేష్, సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీల సభల కన్వీనర్ ప్రమీలా సెల్వరాజ్‌కు ఘననివాళి

పెదకాకాని: బైబిలు మిషను స్త్రీల సభల కన్వీనర్, రెండవ శనివారం ఉపవాస ప్రార్థనల వ్యవస్థాపక నిర్వాహకులు డాక్టర్ జె. ప్రమీలా సెల్వరాజ్ జ్ఞాపకార్థ కూడిక శుక్రవారం పెదకాకాని స్వస్థిశాలలో నిర్వహించారు. కార్యక్రమానికి బైబిలు మిషను వైస్ ప్రెసిడెంటు రెవరెండ్ పి. జాన్ దేవదాసు అధ్యక్షత వహించారు. తొలుత ప్రార్థనలు, కీర్తనలు, వాక్యపఠన జరిగాయి. అనంతరం ముఖ్యవక్తలుగా హాజరైన పలువురు ఆత్మీయ తల్లి ప్రమీలా సెల్వరాజ్‌తో ఉన్న గత స్మృతులను విశ్వాసులకు అందించారు. మాజీ కేంద్ర సహాయ మంత్రి జేడీ శీలం మాట్లాడుతూ దేశ,విదేశాలలో బైబిలు మిషను వ్యాప్తికి ప్రమీలా సెల్వరాజ్ కృషి చేశారని తెలిపారు. ప్రజలందరికీ దేవుని సువార్తను చేరువ చేయడంలో ఆమె కృషి ప్రసంశనీయమని చెప్పారు. ఆమెకు కలిగిన ప్రార్థన శక్తి, ఇతరులపై కనపరిచే ప్రేమ, దయ వంటి లక్షణాలను వారసత్వంగా స్వీకరించాలని సూచించారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఓఎస్‌డీ ఆచార్య ఎన్ శామ్యూల్ మాట్లాడుతూ మోకాళ్ల ప్రార్థన అనుభవంతో ఎంతో మందికి ఆశీర్వాదాలు అందించే ఆత్మీయ తల్లిగా ఎదిగారని తెలిపారు. రాష్ట్ర సమాచార హక్కు చట్టం కమిషనర్ శామ్యూల్ జోనాథన్ మాట్లాడుతూ మానవసేవతో పాటు దేవుని సేవలో పరిపూర్ణమైన, నిస్వార్థపూరితమైన సేవను కొనసాగించిన డాక్టర్ ప్రమీలమ్మ జీవితం విశిష్టమైందని చెప్పారు. పరలోకంలో దేవుని సేవ చేస్తూ ఉన్నారనే నిరీక్షణ ప్రతి ఒక్కరికీ ఉండాలని తెలిపారు. ఏపీసీపీడీసీఎల్ డైరెక్టర్ జయభారతరావు మాట్లాడుతూ నేటి క్రైస్తవ సమాజానికి సేవను అందించి ఆదర్శనీయమైన స్త్రీగా ప్రమీలమ్మ నిలిచారన్నారు. కార్యక్రమంలో కృపా మినిస్ట్రీస్ వ్యవస్థాపకుడు పాస్టర్ మాథ్యూస్, యూపీఎఫ్ వ్యవస్థాపకులు రవి ప్రసాద్ మనుమరాలు జె. మేరి నైనా శోభిల, కుటుంబసభ్యులు వినీత, లాయర్ సురేష్, యశోద హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్, గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ చినబాబు, ప్రమీలారాణి, యూపీఎఫ్ ప్రెసిడెంట్ జోసెఫ్, బైబిలు ప్రొఫెసర్ శాంత సుధాకర్, హైదరాబాదు బైబిలు మిషను పాస్టర్ రెవరెండ్ జాన్ క్రిష్టాఫర్ ఆమె సేవలను కొనియాడారు. అనంతరం దాసరి దేవరాజు వందన సమర్పణ చేశారు. బైబిలు మిషను సెక్రటరీ రెవరెండ్ కోట్ల ప్రశాంత్ కుమార్ ముగింపు ప్రార్థన, బైబిలు మిషను ఉపాధ్యక్షులు రెవరెండ్ పి. జాన్ దేవదాసు ఆశీర్వాదాలతో జ్ఞాపకార్థ కూడిక ముగిసింది. కార్యక్రమంలో బైబిలు మిషను అధ్యక్షులు, కాకాని స్వస్థిశాల నిర్వాహకులు రెవరెండ్ జె. శామ్యేల్ కిరణ్, జాయింట్ సెక్రటరీలు రెవరెండ్ డి. సుధాకర్, రెవరెండ్ ఆగమనరావు, రెవరెండ్ రవి పాల్గొన్నారు.

న్యాయ శాస్త్ర గ్రంథాల రచయిత పెండ్యాల మృతి



పెండ్యాల (ఫైల్)

నగరంపాలెం: ప్రముఖ న్యాయశాస్త్ర (తెలుగు) గ్రంథ రచయిత, వామపక్షవాది పెండ్యాల సత్యనారాయణ (72) రాజమండ్రిలో కన్నుమూశారు. ఆయన స్వస్థలం గుంటూరు. భార్య, కుమార్తె ఉన్నారు. అత్యంత క్లిష్టమైన న్యాయ శాస్త్ర గ్రంథాలను సరళతరమైన వాడుక భాషలోకి వ్యాఖ్యాన సహితంగా అనువదించిన ఘనత వారిది. ఎందరో న్యాయశాస్త్ర విద్యార్థులకు, న్యాయవాదులకు, పోలీస్ అకాడమీ వారికి పెండ్యాల రచనలు ఉపయోగపడ్డాయి. పెండ్యాల ఆఖరి కోరిక మేరకు ఆయన పార్థివ దేహాన్ని వైద్య పరిశోధన నిమిత్తం జి.ఎస్.ఎల్. మెడికల్ కాలేజీకి, కళ్లను ఐ బ్యాంక్‌కు దానం చేశారు. ఆయన భాషా సేవలకు గుర్తింపుగా ఉమ్మడి ఏపీ ప్రభుత్వం విశిష్ట భాషా సేవా పురస్కారంతో సత్కరించింది.

బీజేపీ మహిళా నేత వైఎస్సార్ సీపీలో చేరిక



అద్దంకి రూరల్: బాపట్ల జిల్లా బీజేపీ మహిళా అధ్యక్షురాలు రావిపాటి కాశీకుమారి, ఆమె భర్త విష్ణువర్ధన్ శుక్రవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో బాపట్ల జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మేరుగు నాగార్జున, అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. మండల, పట్టణ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కర్నూలు హైకోర్టు బెంచ్ పరిధిలో చేర్చవద్దు



కోర్టు ప్రాంగణంలో మాట్లాడుతున్న న్యాయవాదులు

- ప్రకాశం, నెల్లూరు జిల్లాల కక్షిదారులకు వ్యయప్రయాసలు
- చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు

చీరాల రూరల్: ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేయబోయే కర్నూలు హైకోర్టు బెంచ్ పరిధిలో నుంచి ప్రకాశం, నెల్లూరు జిల్లాలను మినహాయించాలని చీరాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రమేష్‌బాబు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుతం హైకోర్టు పరిధిలో ప్రకాశం, నెల్లూరు జిల్లాలున్నాయని కక్షిదారులకు న్యాయవాదులకు ఎంతో అనుకూలంగా అమరావతిలోని హైకోర్టు ఉంటుందని తెలిపారు. దీనివల సమయంతోపాటు డబ్బు కూడా కక్షిదారులకు ఆదా అవుతుందన్నారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాలను కొత్తగా ఏర్పాటు చేయనున్న కర్నూలు హైకోర్టు బెంచ్ పరిధిలోకి చేర్చితే కక్షిదారులు, న్యాయవాదులు చాలా ఇబ్బందులు పడాల్సి ఉంటుందని తెలిపారు. కర్నూలు వెళ్లేందుకు కక్షిదారులు అధికంగా ఖర్చులు అవుతాయని..కక్షిదారులకు ఖర్చులు భరించే ఆర్థిక స్థోమత ఉండదని చెప్పారు. అంతేకాక కర్నూలు వెళ్లేందుకు రవాణా సౌకర్యాలు కూడా సక్రమంగా లేవన్నారు. న్యాయవాదులు మాగంటి జ్ఞానేశ్వరరావు, బూదరాజు శశికిరణ్, ఆసాది రామకృష్ణారెడ్డి, పరిశబోయిన తులసీరామ్, మోపూరి తారక రామారావు, స్నేహ, తదితరులు పాల్గొన్నారు.

ఎయిమ్స్‌ను సందర్శించిన నీతి ఆయోగ్ వైస్ చైర్మన్



సుమన్ బెరీని సత్కరిస్తున్న అహెంతా శాంతా సింగ్

మంగళగిరి: అఖిల భారత వైద్య విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)ను శుక్రవారం నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ బెరీ సందర్శించారు. ఎయిమ్స్ పురోగతి, రోగులకు అందుతున్న సేవలపై ఎయిమ్స్ వైద్యులు, అధికారులతో సమీక్షించి పలు సూచనలు చేశారు. రోగుల సంరక్షణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఓపీడీ, రేడియాలజీ, ఆంకాలజీ విభాగాలను సందర్శించి, రోగులకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. రోగులకు అందిస్తున్న సేవలను ఎయిమ్స్ డెప్యూటీ డైరెక్టర్ శశికాంత్ తుమ్మా, వైద్య అధ్యాపకులు వివరించారు.

డంపింగ్ యార్డులో ఇసుకకు కొలతలు



కొలతలు వేస్తున్న భూగర్భ గనుల శాఖ సర్వేయర్ సీతమ్మ

కొల్లిపర: మండలంలోని మున్నంగి, బొమ్మువానిపాలెం 14, 15 ఇసుక రీచుల నుంచి నిన్నటి వరకు ఇసుక తవ్వకాలకు అనుమతి పొందిన కంపెనీల కాలపరిమితి ముగిసింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం యార్డులో నిల్వ ఉన్న ఇసుక వివరాలను నమోదు చేస్తున్నామని భూగర్భ గనుల శాఖ సర్వేయర్ సీతమ్మ తెలిపారు. వివరాలతో సోమవారం ఉన్నతాధికారులకు నివేదిక అందించనున్నట్లు ఆమె తెలిపారు.కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాసరావు, వీర్వో రామారావు, భాస్కర్, ఆయా కంపెనీల ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

పెన్షనర్లు జీవన ప్రమాణ పత్రాలు సమర్పించాలి

గుంటూరు ఎడ్యుకేషన్: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ ప్రాంతీయ కార్యాలయం ద్వారా ఈపీఎస్, ఎఫ్‌పీఎస్- 1971 పెన్షనర్లు జీవన ప్రమాణ పత్రాలను సమర్పించాలని ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్ ఇంద్రనీల్ ఘోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత పెన్షనర్లు తమ జీవన ప్రమాణ పత్రాన్ని ఏడాది వ్యవధి ముగిసేలోపు మరుసటి ఏడాదికి ముందస్తుగా సమర్పించాలని, అందుకు వివిధ పద్ధతులు అమల్లో ఉన్నట్లు పేర్కొన్నారు. పెన్షన్ పొందుతున్న బ్యాంకు, మీ-సేవా, పీఎఫ్ కార్యాలయంతో పాటు పోస్ట్ ఇన్ఫోయాప్ ద్వారా తమ అభ్యర్థన నమోదు చేసిన పక్షంలో పోస్టుమేన్ ఇంటికి వచ్చి వేలిముద్ర, ఐరిష్ స్కాన్ ద్వారా జీవన ప్రమాణ పత్రాన్ని స్వీకరిస్తారని తెలిపారు. ఆండ్రాయిడ్ ఫోన్ ద్వారా ఆధార్ ఫేస్ యాప్, జీవన ప్రమాణ ఫేస్ అప్లికేషన్‌ను ఉపయోగించి ఆధార్ నంబరును దాఖలు చేసి జీవన ప్రమాణ పత్రాన్ని సమర్పించవచ్చునని వివరించారు. సకాలంలో జీవన ప్రమాణ పత్రాన్ని సమర్పించాలని, మూడేళ్లకు పైబడి పెన్షన్ పొందని పెన్షనర్లు గుంటూరు కృష్ణనగర్‌లోని పీఎఫ్ కార్యాలయానికి రావాలని ఆయన సూచించారు.

తొమ్మిది మందిపై కేసు నమోదు

నూజిళ్లపల్లి పీఏసీఎస్ నిధులు దుర్వినియోగం వ్యవహారంలో..



నూజిళ్లపల్లి పీఏసీఎస్ భవనం

జె.పంగులూరు: పంగులూరు మండలం నూజిళ్లపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో నిధులు దుర్వినియోగంపై తొమ్మిది మందిపై కేసు నమోదైంది. జిల్లా కోపరేటివ్ అధికారి సీహెచ్ శ్యాంసన్ ఫిర్యాదు మేరకు గురువారం రాత్రి 9 మందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై బి.వినోద్‌బాబు తెలిపారు. ఈ నిధులు దుర్వినియోగం అయినట్లు 2022లోనే గుర్తించారు. దీనిపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అధికారులు పీఏసీఎస్‌ని నియమించి, 51 ఎంక్వయిరీ నిర్వహించారు. దీర్ఘకాలంగా సాగిన ఈ విచారణలో పీఏసీఎస్‌లో పనిచేసిన ఉద్యోగులు చట్ట విరుద్ధంగా ప్రయివేటు వ్యక్తుల ఖాతాల్లోకి నిధులు మళ్లించి దుర్వినియోగానికి పాల్పడినట్లు విచారణాధికారులు గుర్తించారు. ఈ వ్యవహారంలో తొమ్మిది మంది భాగస్వాములను చేస్తూ విచారణ అధికారి ఇచ్చిన నివేదిక ఆధారంగా చర్యలు తీసుకున్నారు. నాటి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన పెంట్యాల భద్రయ్య, త్రీమాన్ కమిటీ సభ్యులు కొండ్రగుంట రవిబాబు, నాటి సీఈఓ అద్దంకి రవీంద్రబాబు, అటెండర్ చెరుకూరి వెంకట శివప్రసాద్‌తోపాటు, మద్దినేని సుబ్బరామయ్య, మద్దినేని నాగరాజకుమారి, చంద్రశేఖర్, కొల్లి సుబ్బయ్య, పోతురాజులపై డీసీఓ శ్యాంసాన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్‌బాబు తెలిపారు.

మిరపలో సస్యరక్షణ చేపట్టాలి



యడ్లపాడు: మిరప సాగులో సమగ్ర సస్యరక్షణ అవసరమని పల్నాడు జిల్లా ఏరువాక శాస్త్రవేత్త డాక్టర్ ఎం నగేష్ తెలిపారు. యడ్లపాడు మండలం తిమ్మాపురం గ్రామంలో శుక్రవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మిరప పంటను ఆశించే రసం పీల్చే పురుగు, నల్లి, నల్లతామర, తెల్లదోమ తదితర తెగుళ్ల గురించి వివరించారు. నివారణకు చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ ఇచ్చారు. చిలకలూరిపేట ఉద్యాన అధికారి విశాల్ మాట్లాడుతూ.. వివిధ పథకాలను వివరించారు. ప్రభుత్వం అందించే రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం ప్రాధాన్యం గురించి తెలిపారు. కార్యక్రమంలో ఉద్యాన సహాయకులు షేక్ ఆయేషా, గ్రామ పంచాయతీ కార్యదర్శి తదితరులు పాల్గొన్నారు.

బాల నేరస్తుడికి మూడేళ్ల శిక్షణ కాలం ఖరారు

చిలకలూరిపేట టౌన్: హత్యకేసులో బాల నేరస్తుడికి మూడేళ్ల శిక్షణ కాలాన్ని ఖరారు చేస్తూ గుంటూరు న్యాయస్థానం శుక్రవారం తీర్పు ఇచ్చింది. చిలకలూరిపేట రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని బొప్పూడి పరిధిలో 2016లో ఓ హత్య జరిగింది. అప్పటి సీఐ శోభన్‌బాబు కేసు దర్యాప్తు చేశారు. ఇందులో ముగ్గురు నిందితులు ఉన్నారు. ప్రధాన నిందితుడికి 2017లో నరసరావుపేట 13వ అదనపు న్యాయస్థానం జీవిత ఖైదు విధించగా, రెండో వ్యక్తిని నిర్దోషిగా తేల్చారు. మూడో నిందితుడిగా బాలుడు ఉన్నందున సదరు కేసును ఏపీపీ ఎస్ఎస్ఎస్ సుకుమార్ వాదించగా.. గుంటూరు అడిషనల్ జూనియర్ కోర్టు జడ్జి, జువైనల్ బోర్డు కోర్టు న్యాయమూర్తి కె.లత తీర్పు ఇచ్చారు. నిందితుడికి మూడేళ్ల శిక్షణ కాలం ఖరారు చేస్తూ తీర్పు ఇచ్చారు.